

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సమస్యలను పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం ● గ్రీవెన్స్‌లో 81 వినతులు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 10:ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 55, పౌరసరఫరాల శాఖ 4, వైద్య ఆరోగ్యశాఖ 4, సంక్షేమ శాఖ 4, వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 81 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా శాఖల అధికారులు వినతులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోలు సిదందత్తు, కృష్ణవేణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూమి పట్టా చేయాలి..

నిమ్మల సురేశ్, కొండూరు, రాయపర్తి మండలం



వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిని పట్టా చేయాలని సాదా బైనామా కింద దరఖాస్తు చేశాను. అయినా ఆ పేరున పట్టా కాలేదు. ఏడేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. అధికారులు సర్వే నిర్వహించి పట్టా చేయాలి.

బ్యాంకు మేనేజర్ లోను ఇవ్వడం లేదు

బల్ల కుమారస్వామి, నల్లబెల్లి, వర్ధన్నపేట మండలం



పీఎంఈజీపీ పథకం ద్వారా లోను మంజూరైనా ఏపీజీవీబీ బ్యాంక్ ఇల్లంద శాఖ మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ లోను మంజూరు చేయడం లేదు. పీఎంఈజీపీ పథకం కింద లోను మంజూరైనట్టు సంబంధిత అధికారులు లెటర్ పంపించారు. ఆ లెటర్‌ను బ్యాంకు మేనేజర్‌కు చూపినా లోను ఇవ్వడం లేదు. ఎలాగైనా లోను ఇప్పించి ఆదుకోవాలి.

- సన్నాల సాగుకు రైతులు మొగ్గు
- రూ.500 బోనస్‌తో సన్నాహం..
- ఈసారి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం
- వానాకాలం సీజన్‌తో మారిన పరిస్థితి
- జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో వరి
- విత్తనాల కొరత లేదంటున్న అధికారులు



సన్నాలకే సై!

వరంగల్ వ్యవసాయం, జూన్ 9: రాష్ట్ర ప్రభుత్వం వానాకాల సీజన్ నుంచి సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో సన్నరకం వరి విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. గతంతో పోలిస్తే రైతులు ఎక్కువగా సన్న రకాలనే ఎంచుకుంటున్నారు. నైరుతి రుతుపవనాల రాకతో సాగు పనులు ముమ్మరం చేశారు. దొడ్డు రకం వంగడాల కంటే సన్న రకం వంగడాలనే సేకరించేందుకు ఆరాట పడుతున్నారు. ముఖ్యంగా వరంగల్ సన్నాలతోపాటు జైశ్రీరాం, బీపీటీ, తెలంగాణ సోనా, కావేరి విత్తనాలను ఎక్కువగా సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. సన్నాలు సాగు చేయడం వల్ల నష్టపోకుండా ఉండేందుకు మరో అవకాశం ఉందని, చివరకు బియ్యం చేసి అమ్ముకున్నా లాభమే ఉంటుందనేది భావనలో రైతులున్నారు..

జిల్లాలో 1.30లక్షల ఎకరాల్లో సాగు..

వరంగల్ జిల్లాలో సుమారు 1.30లక్షల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సాధారణంగా ప్రతీ సీజన్‌లో రైతులు దొడ్డురకం వరిని ఎక్కువగా సాగు చేస్తుంటారు. దొడ్డు రకం వరికి దోమపోటు రాదు. 15 రోజుల ముందే కోతకు వస్తుంది. సన్నాల కంటే ఎక్కువగా దిగుబడి వస్తుంది. కొనుగోలు కేంద్రాలలో దొడ్డు రకాలనే ఏ గ్రాడుగా నిర్ణయిస్తారు. అంతేకాకుండా ఈదురుగాలులకు, వడగండ్లకు గింజ రాలి పోదనే ధైర్యంతో ఈ సంప్రదాయ సాగునే రైతులు నమ్ముకున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ నుంచి సన్నాలకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సన్నాల వైపు మొగ్గు చూపుతున్నారు.

మండలాల వారీగా వరి సాగు..

చెన్నారావుపేట 8,427 ఎకరాలు, దుగ్గొండి 4,837 ఎకరాలు, ఖానాపురంలో 17,356, నల్లబెల్లిలో 10,239, నర్సంపేటలో 10,851, నెక్కొండలో 12,135, గీసుగొండలో 4,095 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. అలాగే ఖిలావరంగల్ మండలంలో 2,470 ఎకరాలు, పర్వతగిరిలో 15,420, రాయపర్తి 23,146, సంగెంలో 8,811, వరంగల్‌లో 437, వర్ధన్నపేట మండలంలో 16,706 ఎకరాల్లో వరి సాగవుతున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

రూ.500 బోనస్ ఆశతో ..

ఆరెల్లి యాదగిరి రైతు, నల్లబెల్లి



గతంలో మాదిరిగా దొడ్డురకం సాగు చేయడం మానేసి ఈసారి సన్నాలు సాగు చేయాలనుకుంటున్నాం. ప్రభుత్వం సన్నాలకే రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. మద్దతు ధరపై రూ.500 బోనస్ అంటే రైతుకే మేలు జరుగుతుందనే నమ్మకంతో సన్నాల సాగుకే సిద్ధమవుతున్నాం.

ఈసారి సంవృద్ధిగా వర్షాలు..

జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉషాదయాల్



వానాకాలంలో వర్షాలు సంవృద్ధిగా పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులందరూ ఎక్కువగా వరి సాగుపై చేస్తున్నారు. వీటిలో సన్నాలే ఎక్కువగా సాగయ్యే అవకాశాలున్నాయి. మార్కెట్లో వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. దొడ్డు వంగడాలతోపాటు సన్న వంగడాలను రైతులకు అందుబాటులో ఉంచాం. ఎరువులు అన్ని రైతులకు అందుబాటులో ఉన్నాయి.

పారదర్శకంగా ఇంటింటి సర్వే చేపట్టాలి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 10: జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లపై ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం దర్గా రోడ్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మొబైల్ అప్లికేషన్ శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా సర్వే నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాల మేరకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తుందన్నారు. ప్రస్తుతం అందిస్తున్న మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరిపోతుందా, ఇంకా అవసరముందా అనే విషయాలు తెలుసుకునేందుకు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్, ఐకేపీ సీసీలను సర్వే అధికారులుగా నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 625 మందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 25 నుంచి 50 వరకు అప్లికేషన్లు పది రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లచే ప్రొజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజంటేషన్, మొబైల్ అప్లికేషన్‌పై వివరించి సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో రామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకట రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



టెస్కాబ్ చైర్మన్‌గా మార్నేని



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన మార్నేని రవీందర్‌రావు

- హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఏకగ్రీవ ఎన్నిక
- నియామకపత్రాన్ని అందుకున్న రవీందర్‌రావు
- జిల్లాకు ప్రజాప్రతినిధికి తొలిసారి దక్కిన పదవి
- సీఎం, పలువురు మంత్రులను కలిసిన మార్నేని

హనుమకొండ సిటీ, జూన్ 10: తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నియమితులవగా.. వైస్ చైర్మన్‌గా హైదరాబాద్ డీసీసీ బ్యాంక్ చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్ అబిడ్స్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో సీసీ అండ్ ఆర్‌సీఎస్ కమిషనర్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగా ముగిసింది. ఎన్నిక పూర్తయిన తరువాత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ హరిత నుంచి రవీందర్‌రావు నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా చరిత్రలోనే ఇక్కడి డీసీసీ బ్యాంక్ చైర్మన్ టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులు కావడం ఇదే తొలిసారి. మార్నేని ఈ రికార్డును సొంతం చేసుకున్నారు.

కొండురు రాజీనామాతో..

బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. వీటిలో ఒకటి టెస్కాబ్ చైర్మన్ పోస్టు. రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీ బ్యాంకులున్నాయి. చైర్మన్లుగా ఉన్న వారిలో ఏడుగురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. టెస్కాబ్ చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుతో పాటు వైస్ చైర్మన్‌గా ఉన్న నల్గొండ డీసీసీ బ్యాంక్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడలేదు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతో చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం కాగా.. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆయన స్వచ్ఛందంగా టెస్కాబ్ చైర్మన్ పదవికి రాజీనామా చేయగా ఆయనతో పాటు వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి కూడా రాజీనామా చేశారు. ఈ క్రమంలో టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టులకు ఎన్నిక అనివార్యమైంది.

అయితే చైర్మన్ రవీందర్‌రావుపై సోమవారం అవిశ్వాస తీర్మానం జరగాల్సి ఉండగా అంతకు ముందే రవీందర్‌రావు రాజీనా మా చేయడంతో సభ్యులుఈ సమావేశంలో మార్నేని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియకు గత చైర్మన్ కొండురు రవీందర్‌రావు, వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఇక వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేరితో పాటు మిగిలిన ఆరు చైర్మన్లు హాజరై.. వా రంతా మార్నేనికి మద్దతు తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అంతకుముందు పలువురు డీసీసీబీ చైర్మన్లు ఈ చైర్మన్ పదవి కోసం పావులు కదిపారు. కానీ చివరకు మార్నేని రవీందర్‌రావును చైర్మన్ పదవి వరించింది. దీంతో వర్ధన్నపేట నియోజకవర్గం, ఆయన వర్గీయుల్లో సంబురాలు చోటు చేసుకున్నాయి.

మార్నేని బయోడేటా

పేరు, జన్మస్థలం: మార్నేని రవీందర్‌రావు, ఐనవోలు (వర్ధన్నపేట)
తండ్రి : మార్నేని మాధవరావు (స్వాతంత్ర్య సమరయోధుడు)
తల్లి : ప్రమీల
భార్య : మధుమతి (ఐనవోలు ఎంపీపీ)
కూతురు : రిషిత

రాజకీయ నేపథ్యం :

- 1983 నుంచి టీడీపీలో వివిధ పదవుల నిర్వహణ.
- 1987లో ఐనవోలు సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు
- 1996 నుంచి 2004 వరకు ఐనవోలు మల్లిఖార్జున దేవస్థానం ఐనవోలు ధర్మకర్తల మండలి చైర్మన్‌గా వ్యవహరించారు.
- 2006లో వర్ధన్నపేట జడ్పీటీసీగా ఎన్నిక. జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా బాధ్యతల నిర్వహణ. 2009లో బీఆర్‌ఎస్‌లో చేరిక.
- వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా 2020 ఫిబ్రవరి 29 బాధ్యతలు చేపట్టారు.



అమిషాకు బొకే అందిస్తున్న అరూరి, ఈటల, ఎర్రబెల్లి

అమిత్‌షాను కలిసిన అరూరి

మిల్స్‌కాలనీ/వర్ధన్నపేట రూరల్, జూన్ 10 : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి అమిత్‌షాను సో మవారం బీజేపీ రాష్ట్ర నాయకులు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సీనియర్ నేతలు ఎంపీ ఈటల రాజేందర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే బండి సంజయ్, భూపేంద్ర యాదవ్‌లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.



ఆయుర్వేదంలో టెలిమెడిసిన్ సేవలు

0870-2933553కు కాల్ చేస్తే వైద్య సలహాలు

ఉదయం 10 నుంచి 12గంటల వరకు అందుబాటులో

వివరాలు: 7లో

మనిషి జీవితానికి దర్పణంలా 'నాటకాలు'

కాళోజీ కళాక్షేత్రాన్ని నాటకాల ప్రదర్శనకు వీలుగా రూపొందించాలి: రాష్ట్ర నాటక సమాఖ్య అధ్యక్షుడు సదానందం ● రెండోరోజూ కొనసాగిన నాటక పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సదానందం



అనూహ్యం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

వరంగల్ కల్చరల్, జూన్ 10: నాటకాలు ప్రతీ మనిషి జీవితానికి దర్పణంలా నిలుస్తాయని తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. ఉభయ రాష్ట్రాల స్థాయి ఆహ్వాన తెలుగు నాటక పోటీలు పోతన విజ్ఞాన పీఠంలో సోమవారం రెండో రోజు చేరాయి. ముఖ్యఅతిథి సదానందం, విశిష్ట అతిథి బి.సత్యనారాయణ, ఆర్.షణ్ముఖ చారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సదానందం మాట్లాడుతూ హనుమకొండలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రంలో నాటక కళాకారులకు అనువైన విధంగా నిర్మించాలని, రిహార్సల కోసం ప్రత్యేక హాల్ కేటాయించాలన్నారు. రెండో రోజు జరిగిన నాటకలో సంక్షేమ సమాఖ్య పాలకొల్లువారిచే టి.వెంకటేశ్వర్‌రావు రచనతో అన్యూహం నాటకం ప్రదర్శించారు. తల్లిదండ్రుల కష్టార్జితాన్ని కొడుకులు వారసత్వ హక్కు పేరుతో లాక్కోవడం, వారి కష్టాలు, కన్నీళ్లను ఈ నాటిక ద్వారా కళ్లకు కట్టారు. రెండో నాటిక కాకతీయ కళా సమితి హుజురాబాద్ వారి వీలునామా ప్రదర్శించారు. నాటక ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై నాటకాలను తిలకించారు. కార్యక్రమంలో కాజీపేట తిరుమలయ్య, గడ్డం యుగేందర్‌గౌడ్, ఆకుతోట లక్ష్మణ్, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు బల్దియా సమావేశం ఏర్పాటు చేయండి

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



వరంగల్ కార్పొరేషన్, జూన్ 10 : రుతు పవనాలు మారుతున్న దృష్ట్యా గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రజలకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేందుకు బుధవారం బల్దియా కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర దేవాదా యశాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రధాన డ్రైయినేజీలు, డీసిల్టింగ్, చెట్ల పెంపకం, అభివృద్ధి పనులతో పాటు ఇతర అంశాలకు సంబంధిత అధికారులతో కలిసి సమావేశంలో మాట్లాడనున్నట్టు తెలిపారు. అధికారులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని, కమిషనర్ అందరికి సమాచారం అందించి సమావేశానికి హాజరు అయ్యే విధంగా చొరవ చూపాలని మంత్రి వెల్లడించారు.

పెద్దచెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం

కూలిన రాతి గోడ

వరద పెరిగితే కట్ట కొట్టుకుపోయే ప్రమాదం



వేలుబెల్లిలో కూలిన పెద్ద చెరువు కట్ట రాతి గోడ

కొత్తగూడ, జూన్ 10 : కాకతీయుల కాలం నాటి పెద్ద చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంది. చెరువు కట్టకు రక్షణగా ఉన్న రాతి గోడ కూలిపోయింది. శిథిలావస్థలో చెరువు తూము ఉంది. మండలంలోని వేలుబెల్లి గ్రామంలో నాడు కాకతీయులు పాలించే కాలంలో పెద్ద చెరువు తవ్వించారు. సుమారు 30 సంవత్సరాల క్రితం చెరువు కట్టకు బుంగలు పడి నీరు వృథాగా పోతుండగా రైతులు బుంగలు పూడ్చివేసి కట్టకు రక్షణగా రాతి గోడ నిర్మించారు. కాని, నేడు ఆ రాతి గోడ కూలిపోయింది. వర్షాలకు వచ్చిన వరద నీరుతో చెరువు నిండితే కట్టకు బుంగలు పడే ప్రమాదం ఉందని, బుంగలు పడితే చెరువు కట్ట కొట్టుకుపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్ట తెగితే నీరు వృథాగా పోయి పంటలకు నీరు లేక తీవ్రంగా నష్టపోతా మని రైతులు వాపోతున్నారు. చెరువుకు ఉన్న తూము సైతం శిథిలావస్థకు చేరుకుందని, కాలువలు పూడుకు పోయాయని రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే చెరువు కట్టకు, తూములకు మరమ్మత్తు పనులు చేపట్టాలని సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్, రైతులు కోరుతున్నారు. పెద్ద చెరువుకు ప్రమాదం పొంచి ఉందని గత సవంత్సరం మే నెలలో 'పెద్ద చెరువుకు పెద్ద గండం' అనే కథనంను ప్రచురించాము. అయిన నాటి నుంచి నేటి వరకు చెరువు కట్టకు, తూముకు మరమ్మత్తులు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు కట్ట కొట్టుకుపోయిన తర్వాతే అధికారులు స్పందిస్తారేమోనని రైతులు విమర్శిస్తున్నారు.

జూలై 1 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 : కేయూ పరిధిలో పీజీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు జూలై 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 1 నుంచి 12 వరకు కొనసాగునున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై చర్యలు చేపట్టాలి

టెలీకాన్ఫరెన్స్‌లో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 10 : విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి క్షేత్ర స్థాయిలో భద్రత చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరు ణ్‌రెడ్డి అన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల 16 సర్కిళ్ల టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లతో సోమవారం సీఎండీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. తరుచుగా జరిగే విద్యుత్ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని, భద్రతపై నిర్ల క్ష్యం, అవగాహన లోపంతో నాసిరకం విద్యుత్ పరికరాల వినియోగంతో వినియోగదారులు తరుచుగా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రమాదాల నివారణకు సర్కిళ్ల వారీగా టెక్నికల్ డివిజన్ ఇంజనీర్లు నోడల్ సేఫ్టీ అధికా రులుగా వ్యవహరించి వినియోగదారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు, రైతులకు, టీజీ ఎన్పీడీసీఎల్ సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించి వాటిని పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకో వాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు కిందిస్థాయి సిబ్బంది నుంచి సీనియర్ అధికారుల వరకు అందరి కృషి అవసరమన్నారు. ఎన్పీడీసీఎల్‌ను జీరో విద్యుత్ ప్రమాదాల సంస్థ తీర్చిదిద్దేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని, అందుకు ప్రతీ ఒక్క సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలన్నారు.

గన్నీబ్యాగుల ధర రూ.60కు పెంచాలి

మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌కు రైతు సంఘం వినతి



మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతి ప్రతం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు మోర్తాల చందర్‌రావు

వరంగల్ వ్యవసాయం, జూన్ 10: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో రైతుల గన్నీబ్యాగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.30 నుంచి రూ.60లకు పెంచాలని తెలం గాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు సోమవారం హైదరాబా ద్‌లో మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. చందర్‌రావు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏడేళ్లుగా గన్నీబ్యాగుల ధరలు పెంచలే దని, ప్రస్తుతం చెల్లించే రూ.30 సైతం నిబంధనల మేరకు వ్యాపారులు చెల్లించడం లేదని పేర్కొన్నారు. రైతులకు వ్యాపారులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు అదే రైతులు చెల్లించే దడువాయి, హమాలీ, గుల్లవాల, చాటవాల చార్జీ లను మాత్రం క్రమం తప్పకుండా రెండేళ్లకు ఒకసారి పెంచుతూ పోతున్నారని వివ రించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కూస సంపత్‌కుమార్, బల్లు కురి నర్సయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



నెక్రూలా సెంటర్, జూన్ 10 : మహబూ బాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తుతె లియని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఇన్‌చార్జ్ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో కిలోమీటరు రాయి 435/13 వద్ద సుమారు 45ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేష న్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామ న్నారు. ఆమె మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు.

విత్తన ఎంపికే కీలకం



షాపుల్లో సిద్ధంగా ఉంచిన పురుగు మందులు

- ప్రకటనలు చూసి మోసపోవద్దు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- నాణ్యమైన విత్తనాలనే కొనాలి
- రశీదులు భద్రపరుచుకోవాలి
- నేల స్వభావం మేరకు ఎరువులు వాడాలి
- సూచిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బచ్చన్నపేట/నర్మెట, జూన్ 10: రైతులు వానాకాలం సాగును ప్రారం భించారు. రోహిణి కార్తెలో కొంత మంది నార్లు పోయగా, మరికొంత మం ది వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా వరితో పాటు పత్తి, మొక్కజొన్న, కంది పంటలు పెద్ద ఎత్తున సాగు చేసే అవకాశం ఉంది. వర్షాలు సైతం అనుకూలంగా కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తు సంకేతాలు ఇస్తుండటంతో సాగుకు అనుకూలంగా ఉన్న భూములను వదిలి పెట్టకూడదని రైతులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో విత్తన, పురుగు మందుల కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి విస్తృత ప్రచారం చేస్తూ రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గ్రామాల్లో టెంట్లు వేసి రైతులను సమీకరించి భోజనాలు ఏర్పాటు చేసి మరీ ప్రచారం చేస్తున్నాయి. తమ కంపెనీ విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయని, పంటచేనుకు ఎలాంటి తెగుళ్లు రావని ఊదరగొడుతున్నాయి. అధికారులు ఎంత తనిఖీలు చేసినా మార్కెట్లోకి నకిలీ విత్తనాలు, పురుగు మందులు వస్తూనే ఉన్నాయి. అయితే పంట దిగుబడి అధికంగా రావాలంటే నాణ్యమైన విత్తనాలు అవసరం. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా లేకపోతే శ్రమ, పెట్టుబడి కోల్పోక తప్పదు.

పురుగు మందుల కొనుగోళ్లలో జాగ్రత్తలు..

పురుగు మందుల మోతాదు ఎక్కువైతే నష్టపోయేది రైతే. వ్యవశాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని వాడాలని అధికారులు సూచిస్తున్నారు. పురుగు మందు డబ్బాలపై వాటి స్థాయిని తెలిపే విధంగా డైమాండ్ ఆకారంలో ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగులు ముద్రించి ఉంటాయి. వాటి గురించి సమగ్రంగా తెలుసుకుని వాడటం మంచిదని అంటున్నారు. వివిధ రకాల పురుగు మందుల డబ్బాల్లో మందు మిగిలితే అన్నింటిని కలిపి కొట్టడం ప్రమాదకరం. ఇలా చేసి అనేక మంది తమ పంటలను కోల్పోయిన వారు ఉన్నారు. కొనుగోలు చేసే సమయంలో రశీదు తీసుకోవటంతో పాటు, డీలర్ రిజిస్టర్ బుక్‌లో సంతకం చేస్తే, నకిలీ పురుగుమందుల వల్ల నష్టపోతే ప్రశ్నించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎరువుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలే తీసుకోవాలని, అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేసి బిల్లులు భద్రపర్చాలని సూచిస్తున్నారు.

విత్తన కొనుగోళ్లపై నిర్లక్ష్యం తగదు..

నాసిరకం విత్తనాలు వాడితే విరివిగా తెగుళ్లు సోకుతాయని, పంట దిగుబడి తక్కువగా వస్తుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలంటున్నారు. విడి విత్తనాల జోలికి వెళ్లవద్దంటున్నారు. తీసుకునే బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబరు, రకం పేరు, బ్యాచ్ నంబరు గడువు తేదీలు పరిశీలించి తీసుకోవాలంటున్నారు.

నేల స్వభావాన్ని బట్టి ఎరువులు వాడాలి..

నేల స్వభావాన్ని బట్టి పంట ఎదుగుదల, చీడపీడల ఉధృతి ఉంటుంది. అందువల్ల భూమి పోషక విలువలను బట్టి ఎరువులు, పురుగు మందులు వాడడం ఉత్తమం. ఒకరిని చూసి మరొకరు ఒకే రకం పంటలు, విత్తనాలు వేయకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు వాడడం మంచిదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.



నారు పోయడానికి సిద్ధం చేసిన పొలం



డ్రిప్ ఆధారంగా సాగు చేసిన పత్తి

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి...

- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి



విత్తనాల కొనుగోలులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దు. నకిలీ విత్తనాలు అని అనుమానం వస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలి. సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేయాలి. మార్కెట్‌లోకి నకిలి విత్తనాలు, పురుగు మందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై రైతులకు అనుమానం వస్తే వెంటనే ఏఈవోలకు, ఏవోకు, అవసరమైతే నాకు సమాచారం అందించాలి. రైతాంగానికి అన్యాయం జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా కొనసాగిస్తాం.

చేతన ఫౌండేషన్‌కు 'ఆటా' అవార్డు



అమెరికాలోని అట్లాంటా నగరంలో అవార్డు అందుకుంటున్న వెనిగళ్ల రవికుమార్

భారత్ సహా పలు దేశాల్లో సేవా కార్యక్రమాలు

బయ్యారం, జూన్ 10 : భారత్, అమెరికా సహా ఏడు దేశాల్లో వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్న చేతన గ్లోబల్ ఫౌండేషన్‌కు విశ్వనగరం వేదికగా అరుదైన అవార్డు లభించింది. అమెరికాలోని అట్లాంటా నగరంలో చేతన గ్లోబల్ ఫౌండేషన్‌కు అమెరికన్ తెలుగు అసోసియేషన్(ఆటా) అవార్డు లభించడంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన వెనిగళ్ల జగ్గాప్రసాద్‌రావు-సీతామహాలక్ష్మి దంపతుల కుమారుడు రవికుమార్ ఉన్నత విద్యనభ్యసించి అమెరికాలో స్థిరపడ్డాడు. 2016లో రవికుమార్ భార్య రేణుకతో పాటు పలువురు ఎన్ఆర్ఐల సహకారంతో చేతన గ్లోబల్ ఫౌండేషన్ స్థాపించి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ భారత్, అమెరికాతో సహ 7 దేశాల్లో చేతన గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా నిర్వాహకులు సేవా కార్యక్రమాలను విస్తరించారు. పేద ప్రజలు, విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులకు తమవంతుగా సహాయపడేందుకు నిర్వాహకులు ఈ 8ఏళ్ల కాలంలో కోట్ల రూపాయలు వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఈ క్రమంలోనే చేతన గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు నిర్విరామంగా 7 దేశాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన ఆట సంస్థ అవార్డుతో సత్కరించింది. అమెరికాలోని అట్లాంటా నగరంలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మకమైన 18వ ఆట (అమెరికా తెలుగు అసోసియేషన్) మహాసభల సందర్భంగా ఆదివారం ఆట అధ్యక్షుడు బొమ్మినేని మధు చేతుల మీదుగా చేతన గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ల రవికుమార్ ఆట అవార్డు అందుకున్నారు. కాగా, విద్య, వైద్యం, మహిళా సాధికారిక, పర్యావరణంతో పాటు వివిధ రంగాల్లో తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు చేతన గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ గుర్తింపుతో తమపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యాక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా పుట్టిన గడ్డ రుణం కొంతైనా తీర్చుకునే భాగ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అంతేకాక చేతన గ్లోబల్ ఫౌండేషన్‌లో అంకితభావంతో పనిచేస్తూ తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి ఈ అవార్డు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోటవేటర్లో పడి బాలుడి మృతి

- తండ్రి దుక్కి దున్నుతుడగా సరదగా ట్రాక్టర్ ఇంజిన్ ఎక్కిన బాలుడు
- జారి పడటంతో ముక్కలైన శరీర భాగాలు
- వరంగల్ జిల్లా లైన్‌తండాలో విషాదం



గుగులోతు బాలు (ఫైల్)



మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

నల్లబెల్లి, జూన్ 10 : ట్రాక్టర్ రోటవేటర్‌తో తండ్రి దుక్కి దున్నుతుండగా.. సరదాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి ఎక్కిన కుమారుడు ప్రమాదవశాత్తు రోటవేటర్లో పడి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లైన్‌తండాలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం... లైన్‌తండాకు చెందిన గుగులోతు మశోద, రాజులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. సోమవారం రాజు ట్రాక్టర్ ఇంజన్‌కు రోటవేటర్‌ను తగిలించుకొని తన భూమిలో దుక్కి దున్నుతున్నాడు. మధ్యాహ్నం చిన్న కుమారుడు గుగులోతు బాలు(9) రాగా, సరదాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి బాలు ఎక్కాడు. దుక్కి దున్నుతున్న సమయంలో ట్రాక్టర్ కుదుపులకు బాలు రోటవేటర్లో పడిపోయాడు. వెంటనే ట్రాక్టర్‌ను ఆపినా, అప్పటికే శరీరం రెండు ముక్కలైంది. ఘటన స్థలికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. బాలుడి తల్లి మశోద ఫిర్యాదు మేరకు ఎస్సై రామారావు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 :కేయూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి కేయూ పరిపాలన భవనాన్ని ముట్టడించారు. పరిపాలన భవనంలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపించారు. సమస్యలపై విన్నివించినా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్జిగ, పాలు, టీ సరిగా ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులు మెస్ బిల్లులు నెలనెలా కడుతున్నప్పటికీ అధికారులు నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమవుతున్నారన్నారు. వర్సిటీకి పూర్తి స్థాయి వీసీని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థులు శ్రీనాథ్, వృద్ధి, ప్రవళిక, అనూష, శిరీష, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కేయూ పరిపాలన భవనంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

'ఆయుర్వేదం'లో టెలిమెడిసిన్ సేవలు

- వరంగల్‌లోని ప్రభుత్వ బోధనాసుపత్రి నుంచి అందుబాటులోకి
- 0870-2933553కు కాల్ చేస్తే వైద్య సలహాలు
- ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సేవలు



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి



టెలిమెడిసిన్ కేంద్రంలో రోగికి ఫోన్‌లో వైద్య చికిత్స సలహాలు ఇస్తున్న వైద్యుడు

గిర్మాజిపేట, జూన్ 10 : రోగుల సౌలభ్యం కోసం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఇటీవల టెలిమెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పక్షవాతం, అర్షమొలలు, వెరికోస్ వెయిన్స్, మోకాలు నొప్పులు, దీర్ఘకాలిక, మొండి రోగాలకు వైద్య చికిత్స అందిస్తోంది. మెరుగైన సేవలు అందుతుండడంతో రోగులు సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. కరోనా సమయంలో ఆస్పత్రులకు రాలేని రోగులకు ఫోన్ ద్వారా వైద్య సలహాలు అందించారు. ఇదే తరహాలు ఇకనుంచి నిత్యం ఫోన్‌లోనే సలహాలు, సూచనలు అందించేందుకు ఇటీవల ఆస్పత్రి సేవలను అందుబాటులోకి తెచ్చింది.

ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సేవలు..

ఆస్పత్రిలో టెలిమెడిసిన్ కోసం ప్రత్యేక చాంబర్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం, సెలవు రోజులు మినహా ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టెలిమెడిసిన్ అందుబాటులో ఉంటుంది ఆయుర్వేద వైద్య విభాగాలైన శల్య, శాలక్య ప్రసూతి, స్త్రీరోగ, స్వస్థవృత్య, పంచకర్మ, కాయ చికిత్సలలో నిష్ణాతులైన వైద్యులు, వైద్య అధ్యాపకులు ప్రతి రోజు రోగులకు అందుబాటులో ఉంటూ టెలిమెడిసిన్ ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగి 0870- 2933553 టెలిమెడిసిన్ సెంటర్‌కు కాల్ చేయగానే ఆ రోజు సెంటర్‌లో డ్యూటీలో ఉన్న వైద్యుడు రిజిస్టర్‌లో రోగి పేరు, ఫోన్ నెంబర్ నమోదు చేసుకుని రోగికి వైద్య చికిత్స సలహాలు ఇస్తారు. అందుబాటులో ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరి ఉంటే అక్కడికి వెళ్లి ఉచితంగా మందులు తీసుకునే వెసులుబాటు కల్పిస్తారు. లేనిపక్షంలో ప్రయివేట్‌గా కొనుగోలు చేసుకోవచ్చు.

అన్ని రోగాలకూ సేవలు..

గ్యాస్ట్రిక్ ట్రబుల్, కీళ్ల నొప్పులు, తలనొప్పి, మైగ్రేన్, సైనసైటీస్, అర్షమొలలు, దీర్ఘకాళిక నడుము నొప్పులతో పాటుగా ఇన్‌ఫర్టిలిటీ, నిద్రలేమి సమస్యలపై టెలిమెడిసిన్‌కు కాల్ వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో ఆహారం తీసుకోకపోవడం, వృత్తి, కుటుంబపరమైన మానసిక ఒత్తిడి, మారిన జీవన శైలి, రోజువారి శారీరక వ్యాయామం లేకపోవడం, ఫాస్ట్‌ఫుడ్స్ బ్రేవరేజ్ ఐటెమ్స్ తీసుకుంటున్న కారణాలతోనే ఆనారోగ్యా సమస్యలకు గురవుతున్నట్లుగా రోగుల కాల్స్‌తో తెలుస్తోందని వైద్యులు చెబుతున్నారు. వరంగల్ మహానగరంతో పాటుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నిత్యం 10 నుంచి 20 కాల్ వస్తున్నాయని పేర్కొంటున్నారు.

నిష్ణాతులైన వైద్యులు..

వరంగల్ రైల్వే, ఆర్టీసీట బస్‌స్టేషన్‌లకు సమీపంలో ఉన్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి నిత్యం 300 మంది అవుట్‌పేషంట్, వంద మంది ఇన్ పేషంట్‌లతో వైద్య సేవలు అందిస్తోంది. పక్షవాతం, కీళ్లనొప్పులు, మోకాలు నొప్పులు, వెరికోస్ వెయిన్స్ అర్షమొలలు, ఫిస్టిలా, వెన్నునొప్పులు, చెవి, ముక్కు, కన్ను, మధుమేహం, రక్తపోటు, స్త్రీ సంబంధిత, శిశు సంబంధిత రోగాలకు నిష్ణాతులైన వైద్యులు ఉచితంగా మెరుగైన వైద్య చికిత్సలు చేస్తుండటంతో ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా రోగులు వస్తున్నారు.

టెలిమెడిసిన్‌ను వినియోగించుకోవాలి

డాక్టర్ పద్మావతి, సూపరింటెండెంట్



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రాలేని రోగుల కోసం టెలిమెడిసిన్ సేవలు అందిస్తున్నాం. రోగి అనారోగ్య పరిస్థితిని 0870-2933553 కాల్ చేసి చెబితే వైద్యులు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు. సమీప ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీకి రిఫర్ చేస్తూ ఉచితంగా మందులు ఇప్పిస్తున్నాం. ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించాల్సిన పరిస్థితి ఉంటే వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రావాల్సిందిగా సూచిస్తున్నాం. ఈ అవకాశాన్ని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8

వరంగల్ సిటీ

• వరంగల్ • ఖిలావరంగల్ • గీసుగొండ • సంగం

మంగళవారం 11 జూన్ 2024





వేడుకుల్లో పాల్గొన్న ఎంపీపీ, భక్తులు

కుంటపల్లిలో ఆలయాల వార్షికోత్సవం

సంగెం, జూన్ 10: కుంటపల్లిలో నిర్మించిన పోచమ్మ, మైసమ్మల ఆలయాల వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవంలో సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి గ్రామంలోని మహిళలు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కులాల పెద్దలు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



గ్రీష్మితకు స్వీట్ తినిపిస్తున్న కొండా మురళీధర్‌రావు

శంభునిపేట, జూన్ 10 : రంగశాయిపేటకు చెందిన దామెరకొండ గ్రీష్మిత ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించగా, సోమవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆమెను అభినందించి తన కార్యాలయం లో సత్కరించారు. కష్టపడి చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలవాలని, తల్లిదండ్రులకు, ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని చెప్పి గ్రీష్మితకు స్వీటు తినిపించారు. కార్యక్రమంలో దామెరకొండ కర్ణాకర్, నిరంజన్ పాల్గొన్నారు.

బాలకృష్ణకు సన్మానం



బాలకృష్ణకు బొకే అందజేస్తున్న శ్రీధర్

వరంగల్ చౌరస్తా, జూన్ 10: సినీ హీరో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హిందూపురం నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నందమూరి బాలకృష్ణను అఖిల భారత నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం కన్వీనర్, నగరానికి చెందిన జీఎల్ శ్రీధర్ సన్మానించి బొకే అందజేశారు. సోమవారం నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా హిందూపురంలోని బాలకృష్ణ నివాస గృహంలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శ్రీధర్ సన్మానించారు.

'బడిబాట'పై అవగాహన



చిన్నారులను పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వరంగల్ చౌరస్తా, జూన్ 10: బడికి వెళ్లే వయసు కలిగిన చిన్నారులను ఇంగ్లీష్ మీడియం బోధన జరిగే ఏవీవీ పాఠశాలలో చేర్పించాలని, అందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఏవీవీ విద్యాసంస్థల ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోతన ప్రాంతంలోని ఏవీవీ విద్యాసంస్థలో పదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయబడిందని రాజీవ్‌కాలనీ, ఓఎస్ నగర్, పాపయ్యపేట చమన్, కుంటిభద్రయ్య గుడి ప్రాంతం రామన్నపేట అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు ఎ. భుజేందర్‌రెడ్డి, పూర్వ ప్రధానోపాధ్యాయుడు టి.వాసుదేవులు, ఉపాధ్యాయులు సంధ్యారాణి, ఎస్. నవీన్, జి.భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, వీరేశలింగం, రమాదేవి, లాజరస్, చిలుక బాస్కర్, శ్రీకాంత్, రాజేశ్వరి, శశాంక్ పాల్గొన్నారు.

అన్యాక్రాంతమవుతున్న నాగమయ్యకుంట

• డంపింగ్ యార్డ్‌గా మార్చిన వైనం
• గ్రంథాలయం, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలంటున్న స్థానికులు



మురికి నీటి కుంటలా మారిన కుంట



డంపింగ్ యార్డుగా మారిన నాగమయ్యకుంట

శంభునిపేట, జూన్ 10: నగరంలోని 41వ డివిజన్ నాగేంద్రనగర్‌లోని నాగమయ్యకుంట రోజురోజుకూ అన్యాక్రాంతమవుతోంది. ఖిలావరంగల్ మండలం ఉర్సు శివారు సర్వే నెంబరు 119లోని మొత్తం 3.09 గుంటలు ఉండాల్సిన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఉర్సు ఎస్సీ కాలనీ పక్కన జాతీయ రహదారికి కూత వేటు దూరంలో ఉన్న ఈ ప్రభుత్వ స్థలంలో కుంట ఉండేది. చుట్టూ ఇళ్ల నిర్మాణాలు, శ్మశానవాటికలు ఉన్నాయి. కుంటలో చాలా రోజుల నుంచి మున్సిపల్ సిబ్బంది చెత్తను వేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డుగా మారింది. ముళ్లచెట్లు, ఏపుగా పెరుగుతున్నా, చెత్తా చెదారాలతో దుర్వాసన వస్తున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. జంతు కళేబరాలు పడేస్తుండటంతో అనారోగ్యంపాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కుంట ప్రాంతం దోమలు, పందులకు ఆవాసంగా మారింది.

హద్దులు ఏర్పాటు చేయాలి..

ప్రభుత్వ స్థలం ఇప్పటికే కుదించుకుపోయింది. ఇప్పుడున్న స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ స్థలాన్ని పార్కుగా మార్చి వాకింగ్ ట్రాక్‌తోపాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే నగరవాసులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఖాళీ స్థలం ఎక్కువగా ఉండడంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వరంగల్ ప్రాంతంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం లేకపోవటం హనుమకొండకు వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడే గ్రంథాలయం నిర్మిస్తే అందరికీ ఉపయోగంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

కమ్యూనిటీ హాల్, పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి..

ఇక్కడ కమ్యూనిటీ హాల్, పీహెచ్‌సీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే, వరంగల్ ఆర్డీవో, ఖిలావరంగల్ ఎమ్మార్వో కార్యాలయం కూడా నిర్మించాలంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సర్వధర్మ సిద్ధాంతాన్ని ఆచరించిన వీరబ్రహ్మం

వీరబ్రహ్మేంద్రస్వామి మఠాధిపతులు వెంకటాద్రి స్వామిజీ



వెంకటాద్రిస్వామిని సన్మానిస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

వరంగల్ కల్చరల్, జూన్ 10: సర్వధర్మ, సమభావన సిద్ధాంతాన్ని ఆచరించి చూపిన శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం భవిష్యత్తు తరాలకు మార్గదర్శిగా నిలుస్తోందని వీరబ్రహ్మేంద్రస్వామి మఠాధిపతులు నొస్సం వెంకటాద్రి స్వామిజీ అన్నారు. ఆదివారం రాత్రి వరంగల్ హంటర్‌రోడ్డులో పద్మావతి గార్డెన్‌లో సమాజంపై కాలజ్ఞానం ప్రభావం అనే అంశంపై విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం సంచాలకులు బ్రహ్మశ్రీ చొల్లేటి కృష్ణమాచార్యుల అధ్యక్షతన జరిగిన సదస్సుకు స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కులమత బేధాలు లేకుండా, అక్కున చేర్చుకున్న మహనీయుడ బ్రహ్మంగారని తెలిపారు. ఆయన భద్రకాళి మాత ఉపాసకులని పేర్కొన్నారు. ఓరుగల్లు కళలకు కాణాచి అని చారిత్రాత్మక ఓరుగల్లు మహా నగర పర్యటన తనకెంతో ఆనందంగా ఉందన్నారు. స్వామివారిని మాజీ శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు భరత్‌కుమార్, అధికార భాషా సంఘం సభ్యులు త్రిమూర్తుల గౌరీశంకర్, వాస్తుబ్రహ్మ రామగిరి సోమలింగం, బ్రహ్మశ్రీ మడిపోజు ప్రకాష్, డాక్టర్ పోలాస రమేష్, న్యాయవాది మట్టెవాడ విజయ్‌కుమార్, జాతీయ వైశ్య నాయకులు గట్టు మహేష్‌బాబు, రాష్ట్ర పద్మశాలి సంఘం నాయకులు చందా మల్లయ్య, యాదవ మహాసభ అధ్యక్షుడు బాబు యాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి, సంగోజు మోహన్, రామోజు నాగరాజు, మోహన్‌రావు, నర్సింహచారి, పొడిశెట్టి విష్ణువర్ధన్, పెండోట చక్రపాణి, సదానందం, అనుసూరి చంద్రమౌళి, రజిత, హేమలత, భారతి, భీమాచారి, భద్రకాళి ప్రధానార్చకులు భద్రకాళి శేషు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఖానాపురం, జూన్ 10 : జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మండలంలోని అశోక్‌నగర్ లోని తెలంగాణ గిరిజన సంక్షేమ సైనిక పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న గిరిజన విద్యార్థులు ప్రతిభచాటారు. జాతీయ స్థాయి గిరిజన కేటగిరిలో జాదవ్ ఉదయ్ కిరణ్ 736వ ర్యాంకు, బానోత్ రాజ్‌కుమార్ 1287 ర్యాంకు, మరో నలుగురు గిరిజన విద్యార్థులు గిరిజన కేటగిరిలో అత్యుత్తమ ప్రిపరేటరీ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌స్వామి, డైరెక్టర్ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్ఠమైన ప్రణాళికతో వినూత్న రీతిలో ఆధునిక పద్ధతిలో విద్యా బోధన చేయడం వల్ల, విద్యార్థుల కృషి పట్టుదలతో జాతీయ స్థాయిలో ఎస్టీ కేటగిరిలో అత్యుత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించాలి: కలెక్టర్



బడిబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 10: పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నియంత్రణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు జిల్లా అధికారులు ముందుకు రావాలని, తద్వారా మండల, గ్రామస్థాయిలో పూర్తి నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్లాస్టిక్‌ను నియంత్రించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు సిదం దత్తు, కృష్ణవేణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడిబాట పోస్టర్ ఆవిష్కరణ

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలనే లక్ష్యంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బడిబాట వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బాల కార్మికులు, బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఆర్డీవోలు సిదం దత్తు, కృష్ణవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సంగెం, జూన్ 10: రైతు, ప్రజాసమస్యల్ని పరిష్కరించాలంటూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో సంగెంలో ర్యాలీ నిర్వహించి, తహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం మండల కార్యదర్శి ఇస్మాయిల్ నేతృత్వంలో అంబేద్కర్ సెంటర్ నుంచి ర్యాలీగా తహసీల్‌కార్యాలయ ఇన్‌చార్జికి వినతి పత్రం అందించారు. ఈమేరకు ఇస్మాయిల్ మాట్లాడుతూ రెండు లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు ఎన్నికల్లో ఇచ్చినహామీలను నెరవేర్చాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, జక్క అశోక్, దత్త దూడయ్య, సోమిడి రవి, వరికెల రామారావు,శివకుమార్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలి



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న జీటీఏ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జీటీఏ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాశ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో డీఈవో డి.వాసంతిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఎలాంటి అవకతవకలు లేకుండా సీనియారిటీ జాబితాలను రూపొందించి వాటిని ప్రదర్శించి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయుల అభ్యంతరాలను స్వీకరిస్తూ వాటిని పరిష్కరిస్తూ సామరస్యపూర్వక వాతావరణంలో ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పబ్బోజు వీరాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం రవి, నాయకులు కోటేశ్వర్, గంగాధర్, ఆకోజు కిరణ్, సముద్రాల రాజు, పోగు అశోక్, ఉపేందర్ పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన ట్రాక్టర్.. ఒకరికి గాయాలు



లేబర్‌కాలనీ వద్ద మోపెడ్‌పై వస్తున్న వ్యక్తిని ఢీకొట్టి పల్టీకొట్టిన ట్రాక్టర్



గాయాలపాలైన శంకర్

ఖిలావరంగల్,జూలై 10: వరంగల్ -నర్సంపేట దారిలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఇంజన్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన డివిజన్ లేబర్‌కాలనీలో సోమవారం జరిగింది. మిల్స్‌కాలనీ పోలీసులు, స్థానికులు కథనం ప్రకారం. హంటర్‌రోడ్ నుంచి గొర్రెకుంట గోడౌన్‌కు నూతన ట్రాక్టర్ ఇంజన్‌లను తీసుకువెళ్లే క్రమంలో శాలినినగర్ నుంచి నర్సంపేట రోడ్‌కు వస్తున్న గీసుగొండ మండలం, కోనాయమాకుల గ్రామానికి చెందిన పాల వ్యాపారి శంకర్ లూనాఎక్స్‌ఎల్ బండికి ట్రాక్టర్ ఇంజన్ తగలడంతో శంకర్ వ్యక్తి కిందపడాడు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ కిందకు దూకడంతో పల్టీ కొట్టి కింద పడింది. గాయపడిన శంకర్‌ను 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హామీలను నెరవేర్చాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖిలావరంగల్, జూన్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐయూ జిల్లా నాయకుడు నర్రా ప్రతాప్, నగర నాయకుడు సుంచు జగదీశ్వర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల ప్రధాన సమస్యలైన పౌష్టికాహారం, నిత్యవసర వస్తువులు, విద్యా, వైద్యం, నిరుద్యోగం వంటి సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఇటీవల అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ- యూ నాయకులు రాయినేని అయిలయ్య, నల్గొండ రవి, ప్రభాకర్, నరసయ్య, సీ.హెచ్ రాజు, పాల్గొన్నారు.

దుకాణ సముదాయాల పరిశీలన

చెన్నారావుపేట, జూన్ 10 : మండల కేంద్రంలోని పలు దుకాణ సముదాయలను ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం పరిశీలించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తి ప్రధాన సెంటర్‌లో ఉదయ్ అనే వ్యక్తి తినుబండరాలను తయారు చేసి నిల్వ చేసే గోదాంను పరిశీలించారు. అక్కడ అపరిశుభ్రంగా ఉండి దుర్వాసన వస్తూ, షాపు యాజమాని అందుబాటులో లేదు. దీంతో ఈ షాపు నిర్వహణకు ఎలాంటి అనుమతుల లేకపోవటంతో షాపు గోదాంను సీజ్ చేశారు. ఆ పక్కనే ఉన్న నూకల సప్లయి యాజమాని నిబంధనలు పాటించకపోవడంతో యజమాని ఉపేందర్‌కు అధికారులు నోటీసులు అందించారు. సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కలుషితమైన ఆహార పదార్థలను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

కేయూ బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుడు



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుడిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

నర్సంపేట టౌన్, జూన్ 10 : కాకతీయ యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ ఎ.శ్రీనాథ్‌లు ఎంపి కయ్యారు. నర్సంపేట కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకుడు శ్రీనాథ్‌లను అధ్యాపక బృందం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేయూ తమకు అందించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఐ. శివనాగ శ్రీను, ఎం. నరేందర్, టి. రమేష్, సత్యనారాయణ, విష్ణుకుమార్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లిస్తున్నా.. రోడ్డు ఎందుకు వేయరు?

ప్రజావాణిలో పలు కాలనీల వాసుల గగ్గోలు



ప్రజావాణిలో సమస్యలు వెల్లడిస్తున్న ఫిర్యాదుదారులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 10: తాము ప్రతీ సంవత్సరం ఇంటి పన్ను, నల్లా పన్ను, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నాం. కానీ తమ కాలనీలకు సీసీ రోడ్డు ఎందుకు వేయడం లేదని పలు కాలనీల ప్రజలు బల్దియా అధికారులను నిలదీశారు. గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలపై సోమవారం బల్దియా కౌన్సిల్ హాల్‌లో గ్రీవెన్ సెల్‌లో ప్రజలు సమస్యలను అధికారులకు విన్నవించారు. అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు వెల్లడిస్తున్న సమస్యలపై అక్కడే ఉన్న అధికారులను అడిషనల్ కమిషనర్ పిలిచి ప్రజల సమస్యలపై దర్యాప్తు చేసి పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్ సెల్‌లో 58 దరకాస్తులు అందినట్టు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయోలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేష్, డిప్యూటీ కమిషర్ కృష్ణారెడ్డిలతో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్- 22, హెల్త్, సానిటరీ- 06, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 02 టౌన్ ప్లానింగ్ - 28 ఫిర్యాదులు అందాయి.

- గత రెండు మాసాలుగా కాలనీలో మంచినీటి సమస్య ఉందని, సైడు కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్లలో నుంచి వస్తున్న నీరు రోడ్డు మీద పారుతుందని వరంగల్ శ్రీరాంనగర్ కాలనీ (రామకృష్ణ కాలనీ) డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ ఓ సిటీలో వీధి దీపాలు వెలగడం లేదని ఓ సిటీ రెసిడెంట్ అసోసియేషన్ నాయకులు గ్రేటర్ అధికారులకు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలోని శ్రీరామ కాలనీలో ఇళ్ల మధ్యలో పిచ్చి మొక్కలు మొలిచి ఇబ్బందికరంగా ఉండి. రాత్రి సమయంలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించి పరిష్కారం చూపాలి.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 11 జూన్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

జేఈఈ అడ్వాన్స్‌లో అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ఉదయ్‌కిరణ్



రాజ్‌కుమార్

ఖానాపురం, జూన్ 10 : జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మండలంలోని అశోక్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ సైనిక పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న గిరిజన విద్యార్థులు ప్రతిభచాటారు. జాతీయస్థాయి గిరిజన కేటగిరిలో జాదవ్ ఉదయ్ కిరణ్ 736వ ర్యాంకు, బానోత్ రాజ్‌కుమార్ 1287 ర్యాంకు, మరో నలుగురు గిరిజన విద్యార్థులు గిరిజన కేటగిరిలో అత్యుత్తమ ప్రిపరేటరీ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌స్వామి, డైరెక్టర్ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్ఠమైన ప్రణాళికతో వినూత్న రీతిలో ఆధునిక పద్ధతిలో విద్యా బోధన చేయడం వల్ల, విద్యార్థుల కృషి పట్టుదలతో జాతీయ స్థాయిలో ఎస్టీ కేటగిరిలో అత్యుత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

దుకాణ సముదాయాల పరిశీలన



షాపు యాజమాని ఉపేందర్‌కు నోటీసులు అందిస్తున్న అధికారులు

చెన్నారావుపేట, జూన్ 10 : మండల కేంద్రంలోని పలు దుకాణ సముదాయలను ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం పరిశీలించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తి ప్రధాన సెంటర్‌లో ఉదయ్ అనే వ్యక్తి తినుబండరాలను తయారుచేసి నిల్వ చేసే గోదాంను పరిశీలించారు. అక్కడ అపరిశుభ్రంగా ఉండి దుర్వాస వస్తూ, షాపు యాజమాని అందుబాటులో లేదు. దీంతో ఈ షాపు నిర్వహణకు ఎలాంటి అనుమతుల లేకపోవటంతో షాపు గోదాంను సీజ్ చేశారు. ఆ పక్కనే ఉన్న నూకల సప్లయి యాజమాని నిబంధనలు పాటించకపోవడంతో యజమాని ఉపేందర్‌కు అధికారులు నోటీసులు అందించారు. సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కలుషితమైన ఆహార పదార్థలను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీ కావ్యను కలిసిన పీహెచ్‌సీ ఉద్యోగులు



ఎంపీ డాక్టర్ కావ్యను కలిసిన వైద్యులు, సిబ్బంది

వర్ధన్నపేట, జూన్ 10 : వరంగల్ పార్లమెంట్ సభ్యురా లుగా ఎన్నికైన డాక్టర్ కడియం కావ్యను వర్ధన్నపేట సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యులు, సిబ్బం ది సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి ఆధ్వర్యంలో సోమవారం ఆమెను హనుమ కొండలోని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పూలబొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజ్‌కుమార్, మానసరెడ్డి, సిబ్బంది మొగిలి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుడు



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుడిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

నర్సంపేట టౌన్, జూన్ 10 : కాకతీయ యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, ఆంగ్ల అధ్యాపకు డు డాక్టర్ ఎ.శ్రీనాథ్‌లు ఎంపి కయ్యారు. నర్సంపేట కళాశాల లో సోమవారం ఏర్పాటు చేసి న కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకుడు శ్రీనాథ్‌లను అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేయూ తమకు అందించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐ. శివనాగశ్రీను, ఎం. నరేందర్, టి. రమేష్, సత్యనారాయణ, విష్ణుకుమార్, డాక్టర్ జి. ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

బడిబాట.. కారాదు ఒట్టిమాట

ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించేందుకు ఉపాధ్యాయుల గ్రామాల బాట

ప్రైవేటు వైపే మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులు



మంగళవారిపేటలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఖానాపురం, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు, బడిమానిన పిల్లలను పాఠశాలలో చేర్పించేందకు జూన్ మొదటి వారంలో ప్రతి ఏటా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. వివిధ కారణాలతో ఆశించిన మేర లక్ష్యం నెరవేరడంలేదు. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు బడిబాట కార్యక్రమం చేపట్టారు. జూన్ 3న బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈ నెల 19 వరకు కొనసాగనుంది. దీంతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి మధ్యలో బడిమానిన విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు.

కూలీపనుల వైపే మొగ్గు

గ్రామాల్లో సాదారణంగా జూన్ నుంచి వ్యవసాయ పనులు ప్రారంభం అవుతాయి. దీంతో పత్తి, కంది తదితర విత్తనాలు నాటేందుకు 10 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలిక అవశ్యకత ఉంటోంది. దీంతో నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులు వారిని కూలీపనులకు, సొంత వ్యవసాయ పనులకు పంపేందుకే మొగ్గు చూపుతూ పాఠశాలలకు దూరం చేస్తున్నారు.

జీవనాధారం లేక

మండలంలోని శివారు గిరిజన తండాల్లో జీవనాధారం లేక పిల్లల తల్లి దండ్రులు వలసబాట పడుతూ పిల్లలను కూడా తమ వెంట తసుకెళ్తుంటారు. దీనికి తోడు మారుమూల పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పిల్లలనుబడిలో చేర్పించలేకపోతున్నారు. ఈ సారైనా ఉపాధ్యాయులను నియమించి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తే బడిబయట ఉన్న పిల్లల సంఖ్య తగ్గే వీలుంటుంది. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడిప్పుడే మెరుగవుతున్న సౌకర్యాలు

మండల వ్యాప్తంగా 36 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో మొత్తం విద్యార్థులు 1989మంది ఉన్నారు. వారిలో బాలురు 908మంది, బాలికలు 1081 మంది విద్యను అభ్యసిస్తున్నారు. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం మన ఊరు-మనబడి కార్యక్రమం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పలు రకాలు అభివృద్ధి పనులు చేపట్టి విద్యార్థులకు సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టారు. మండలంలో మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 34 పాఠశాలల్లో రూ.26.61 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగుతుండగా కొన్ని పాఠశాలల్లో పనులుపూర్తయి విద్యార్థులకు సౌకర్యాలు చేకూరాయి.

ప్రైవేటు వైపే మొగ్గు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, టాయిలెట్లు, ఇతర మౌలిక వసతులు కల్పించినప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు వైపే మొగ్గు చూపతున్నారు. మండలంలో గత నెలరోజుల నుంచి ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు గ్రామాలను చుట్టేస్తున్నారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులనుఒప్పిస్తూ పిల్లలను తమ పాఠశాలల్లో చేర్చుకునేందుకు అడ్మిషన్లు ఇస్తున్నారు. కాగా బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుకునేందుకు ఇంటింటికి తిరుగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల విద్యా బోధన విధానాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించడంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు విఫలం చెందుతున్నారు. అంతేకాకుండా కొంత మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులు బడిబాట కార్యక్రమంలో మొక్కుబడిగా పాల్గొంటూ వచ్చామా పోయామా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంటు పెరగకపోగా ఏటా తగ్గుతూవస్తుంది. జూన్ 3న బడిబాట కార్యక్రమం ప్రారంభం కాగా, మండల వ్యాప్తంగా కేవలం 15మంది విద్యార్థులే ప్రభుత్వ పాఠశాలల్లో చేరడంతో బడిబాట కార్యక్రమం ఆశించిన మేర లక్ష్యాన్ని చేరుకునేటట్లు కనిపించడం లేదు.

బాధ్యత తీసుకొని బడులను బలోపేతం చేయాలి

బడిబాట కార్యక్రమంలో మొక్కుబడిగా పాల్గొంటున్న అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకొని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సి ఉంది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు అన్ని విధాలుగా వసతులు కల్పిస్తున్నప్పటికీ విద్యార్థుల సంఖ్య పెరగడంలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి చాలా మంది విద్యార్థులు ఆసక్తిగా ఉన్నారు. కానీ విద్యార్థుల తల్లిదండ్రులను సరిగ్గా గైడ్ చేసేవారే లేరని స్థానికులు వాపోతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపరిస్తేనే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరుగుతాయని స్థానికులు అంటున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి..



నర్సంపేటలో ధర్నా నిర్వహిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

నర్సంపేట, జూన్ 10 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజా పోరాటాలు తప్పవని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచిపోతున్నా ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమై వ్యవసాయ పనులకు రైతులు సిద్ధమైనప్పటికీ ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు సరఫరా చేయకపోవడం వల్ల నకిలీ విత్తనాల అమ్మకాలు పెరిగిపోయాయన్నారు. రూ.2లక్షల రుణ మాఫీ ఆగస్టు 15 తర్వాత చేస్తామని ప్రభుత్వం చెప్పడం వల్ల బ్యాంకర్లు పంట రుణాలను రైతులకు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారన్నారు. పేదల ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు కొత్తకొండ రాజమౌళి, గజవెల్లి జగపతి, సాయికుమార్, పాషా, యాకయ్య, జయ, రణధీర్,జరీనా, ఏఐసిటియూ జిల్లా అధ్యక్షుడు ఎండి. మాషూక్ పాల్గొన్నారు.

● వర్ధన్నపేట : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంసీపీఐయూ వరంగల్ డివిజన్ కార్యదర్శి మంద రవి అన్నారు. సోమవారం వర్ధన్నపేట తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు రూ.4వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్‌తో పాటు ప్రతీ మహిళకు రూ.2500, గ్యాస్ సిలెండర్‌కు రూ.500 నేరుగా లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కింద రూ.2లక్షలను మాఫీ చేయాలని అన్నారు. కార్య క్రమంలో ఎంసీపీఐయూ నేతలు మంద బాబు, ఉడుత భిక్షపతి, గజ్జెల రాజు, ఎండి లతీఫ్, ఉడుత శ్రీను, ఉడుత రాజు తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి జన్ను రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మొర్రి శ్రీను, సాంబయ్య, గౌరెమీయా, రాజిరెడ్డి పాల్గొన్నారు.

● దుగ్గొండి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే దశాల వారీగా ఉద్యమిస్తామని ఎంసీపీఐయూ డివిజన్ కార్యదర్శి ఎండీ రాజాసాహెబ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం సోమవారం అందించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి కొంరయ్య, ఎల్లబోయిన రాజు, బత్తిని కుమారస్వామి, పేరబోయిన ఐలోని, మేరుగు సుధాకర్, సలీంపాష, గాదం సారంగం పాల్గొన్నారు.

● పర్వతగిరి: ప్రజలు, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని యంసీపీఐయూ మండల కార్యదర్శి ఎమ్డీ. ఇస్మాయిల్ అన్నారు. ఈ మేరకు తహ సీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రం అందించి, మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జక్కా అశోక్, సోమిరెడ్డి రవి, గోనె రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

● సంగెం : రైతు, ప్రజాసమస్యల్ని పరిష్కరించాలంటూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో సంగెంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం మండల కార్యదర్శి ఇస్మాయిల్ నేతృత్వంలో అంబేడ్కర్ సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్ కార్యాలయ ఇన్‌చార్జికి వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, జక్క అశోక్, దత్త దూడయ్య, సోమిడి రవి, వరికెల రామారావు,శివకుమార్ పాల్గొన్నారు.

కోళ్లఫారం బారి నుంచి రక్షించండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న తండా వాసులు

రాయపర్తి, జూన్ 10 : కోళ్లఫారం బారి నుంచి రక్షించాలని సోమవారం మండలంలోని పన్యానాయక్ తండాకు చెంది గిరిజనులు గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందచేశారు. తండా పరిధిలో గృహ నివాసాలకు దగ్గరగా నిర్మిస్తున్న కోళ్ల ఫారం అనుమతులను వెంటనే రద్దుచేయాలని వివరించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే మండల తహసీల్దార్‌కు కోళ్లఫారాన్ని వెంటనే సీజన్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. గత నెలలో దీనిపై ఆందోళనలు చేసినప్పటికీ మండల అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ క్రాంతి, మాజీ ఎంపీటీసీ దేశిరాం, రాజారాం, రవి, కిషన్, బాలాజీ, రమేష్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టెస్కాబ్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



రవీందర్‌రావును కలిసిన కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట, జూన్ 10 : తెలంగాణ రాష్ట్ర సహకార ఎపెక్స్ బ్యాంక్ (టీఎస్‌సీ ఏబీ) చైర్మన్‌గా నియమితులైన వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావును సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఆయన నివాసంలో కలిసి అభినందించారు. వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మైస సురేష్, జిల్లా నాయకులు చీటూరి రాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పొదుపులతో ఆర్థిక పురోగతి

నర్సంపేట టౌన్, జూన్ 10 : పొదుపులతో ప్రతీ గౌడ కుటుంబం ఆర్థికంగా పురోగతి సాధిస్తుందని గౌడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గండి లింగయ్యగౌడ్ అన్నారు. నర్సంపేట డివిజన్ గౌడ సంక్షేమ సహకార పరపతి సంఘం ద్వితీయ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం స్థానిక పద్మశాలి గార్డెన్స్‌లో సోమవారం జరిగింది. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మాచర్ల ఐలుమల్లుగౌడ్, బూర అశోక్‌గౌడ్, ఊడుగుల శ్రీనివాస్, లక్ష్మినారాయణ, నర్సయ్య, జనార్ధన్, అశోక్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి పాటుపడాలి



యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న గోగుల

నర్సంపేట, జూన్ 10 : భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పాటుపడాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలో సోమవారం నిర్వహించిన చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నారావుపేట మండలం ఖిల్‌నాయక్‌తండాకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో యువతకు ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందన్నారు. యువత రాజకీయాల్లో చేరాలని, పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, దామెరుప్పుల శేఖర్, రంజిత్, రాజు, రవీందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దుగ్గొండి మండల సమావేశం

దుగ్గొండి, జూన్ 10 : ఈ నెల 12న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుంధతి సోమవారం వెల్లడించారు. సమావేశంలో అభివృద్ధి పనులైన వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, విద్య, రోడ్లు, పశువర్ధక తదితర అంశాలపై చర్చిస్తారని, సకాలంలో సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.



వేడుకుల్లో పాల్గొన్న ఎంపీపీ, భక్తులు

కుంటపల్లిలో ఆలయాల వార్షికోత్సవం

సంగెం, జూన్ 10 : కుంటపల్లిలో నిర్మించిన పోచమ్మ, మైసమ్మల ఆలయాల వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవంలో సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి దంపతులు ప్రత్యేక పూజలుచేశారు. అమ్మవారికి గ్రామంలోని మహిళలు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కులాల పెద్దలు పాల్గొన్నారు.

దశాబ్ది డిపాజిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డీసీసీ బ్యాంకు ఉద్యోగులు

వర్ధన్నపేట, జూన్ 10: డీసీసీ బ్యాంకు వర్ధన్నపేట శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంక్ డీజీఎం కురువు నాయక్, నోడల్ అధికారి భద్రునాయక్‌లు కోరారు. సోమవారం వర్ధన్నపేట పట్టణంలోని ప్రధానరహదారులపై బ్యాంకు అధికారులు, సహకార సిబ్బందితో కలిసి బ్యాండ్‌తో ర్యాలీ నిర్వహించి కరప్రతాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ తమ బ్యాంకులో తెలంగాణ దశాబ్ది పథకాన్ని ఇటీల ప్రవేశపెట్టారని, డిపాజిట్‌లపై 8.10శాతం అత్యధిక వడ్డీ అందిస్తున్నట్లు చెప్పారు. బంగారు ఆభరణాలతో సైతం తక్కువ వడ్డీతో ఎక్కువ మొత్తం ఇస్తుందన్నారు. బ్యాంకులో లాకర్ సదుపాయం ఉందని తమ బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లించి సహకరించి బ్యాంకు పురోభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వర్ధన్నపేట బ్రాంచి మేనేజర్లు శ్రవణ్‌కుమార్, సమ్మక్క, ఫీల్డ్ అధికారి సురేష్, పీఏసీఎస్ సీఈవోలు తండా వెంకన్న, యాదగిరి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా డీసీసీ బ్యాంకు అందిస్తున్న దశాబ్ది డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట డీసీసీ బ్యాంకు మేనేజర్ పూర్ణచందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు డీసీసీ బ్యాంకు డిపాజిట్లపై అందిస్తున్న అత్యధిక వడ్డీరేట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో ఆంజనేయులు, ఫీల్డ్ ఆఫీసర్ శోభన్, సిబ్బంది మేరుగు రాజు, వినయ్, అశోక్, కొమురయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించి వైద్యం అందించాలి



దవాఖానాను తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

దుగ్గొండి, జూన్ 10 : సమయ పాలన పాటించి గ్రామీ ణ ప్రజలకు వైద్య సేవలు అం దించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ వైద్య సిబ్బందిని కోరారు. మండలంలోని తిమ్మంపేట పల్లె దావాఖానను సోమవారం సంద ర్శించి తనిఖీచేశారు. పల్లె ప్రజల కు వైద్య సేవలు అందించేందుకు పల్లె దవాఖానలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి రోగులకు పరీక్షలు చేసి తగు సూచనలు చేయాలన్నారు. రోజు వారి ఓపీ రిజష్టర్ పరిశీలన చేశారు. డాక్టర్ వృద్వి, ఏఎన్ఎం రజిత, హెల్త్ అసిస్టెంట్ చాణిక్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు ధ్వంసం చేశారని ఫిర్యాదు

పర్వతగిరి, జూన్ 10 : మండలంలోని దౌలత్‌నగర్ గ్రామంలో గల వ్యవసాయ భూమి వద్ద వ్యవసాయ పరికరాలను గ్రామానికి చెందిన పలువురు ధ్వసం చేశారని బాధితుడు దద్దు రవీందర్ తెలిపారు. సోమవారం ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తుల తమ పొలం వద్ద బోరుబావి స్టార్టర్, డబ్బా ఫ్యూజులు, ఆటో స్టార్టర్, మోటారు వైరు, సర్వీస్‌వైరు, వాటరు పైపులు, కప్లింగ్‌లు తదితర వస్తువులను ధ్వంసం చేశారని తెలిపారు. ఘటనలో సుమారు రూ.20వేల నష్టం వాటిల్లిందని, తనకు ప్రాణభయం ఉందని తెలిపారు. అధికారులు పరిశీలించి తనకు పరిహారం ఇప్పించడంతో పాటు బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పర్వతగిరి, జూన్ 10 : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ తండ్రి జాటోత్ అమ్మనాయక్ సోమవారం మృతిచెందగా ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికిగల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, ప్రధానకార్యదర్శి పుల్లూరి దిలీప్‌కుమార్, నాయకులు ఎర్రబోయిన సాంబరాజు, కత్తుల శ్రీనివాస్, నీరటి ప్రశాంత్, దొనికి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

పర్వతగిరి, జూన్ 10 : గుడుంబాను స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసునమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం మండలకేంద్రంలో నాటుసారాయి అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి నెక్కొండ మండలంలోని మైబునాయక్‌తండాకు చెందిన బానోత్ లక్ష్మి, బాదావత్ పున్నమ్మ, భూక్యా వీరమ్మ, బాదావత్ విజయ, బానోత్ తారమ్మ, బానోత్ రూప్లి అనే అరుగురు మహిళలను పట్టుకుని కేసులునమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 36 లీటర్ల గుడుంబాతో పాటు రూ.14,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్సై గుగులోత్ వెంకన్న, సిబ్బంది రాజు, లింగమూర్తి, నరేష్ పాల్గొన్నారు.

ధాన్యం దొంగిలించిన ఘటనపై విచారణ

మండలంలోని ఇస్లావత్‌తండా శివారు మంగళ్‌బోడ్ తండాలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం చోరీకి గురైందని బాధిత రైతులు మాలోత్ సంతోష్, మాలోత్ వీరన్నలు ఫిర్యాదుచేయడంతో ఎస్సై గుగులోత్ వెంకన్న క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ధాన్యం ఆరబోసిన ప్రాంతాన్ని పరిశీలించి దొంగతనానికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మండల పాస్టర్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక



నల్లబెల్లిలో నూతనంగా ఎన్నికైన పాస్టర్ మండల కమిటీ

వర్ధన్నపేట రూరల్, జూన్ 10 : మండలంలోని నల్లబెల్లిలో ఎక్లేసియా ప్రార్థన మందిరంలో పాస్టర్ సుమన్ ఆధ్వర్యంలో మండల పాస్టర్ ఫెలోషిప్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జన్ను ప్రభాకర్, గౌరవ అధ్య క్షుడిగా ఇ.ఆంధ్రయ్య, ఉపాధ్యక్షుడిగా కుమార్‌పాల్, జాయింట్ ఉపాధ్యక్షుడిగా శ్యాంసుందర్‌రెడ్డి, కార్యదర్శిగా పాస్టర్ జీవ వృక్షం, కోశాధికారిగా కె.సుమన్, సహాయ కార్యదర్శిగా పాస్టర్ రాజుపాల్, జాయింట్ సహాయ కార్యదర్శిగా యాకూబ్, లీగల్ అడ్వైజర్‌గా ప్రకాశం, ముఖ్య సలహదారులుగా ప్రభుదాస్, మల్లేషం, అశోక్‌రెడ్డి, ఈసీ మెంబర్లుగా క్రిష్టాఫర్, జోసఫ్, జావుసింగ్, యోబు, డేవిడ్ రాజ్ తదితరులను ఎన్నుకున్నారు.